క్లుప్తంగా


భీమేశ్వరుని దర్శించుకున్న మంత్రి వేణు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దధి(ఆవు పెరుగు) నివేదన చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. మంత్రి వేణు వెంట నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సూరంపూడి సుబ్రహ్మణ్యం, చీకురిమిల్లి నాగేంద్ర(నాని), కురుపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో సామూహిక కుంకుమ పూజలు



విజయదుర్గా అమ్మవారు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పీఠానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విజయదుర్గా అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజల అనంతరం భక్తులు పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఉద్బోధించారు. ప్రతిఒక్కరూ తమ ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవడం వల్ల కొంత మానసిక ఉపశమనం పొందే వీలుందన్నారు. భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఆయన చేతుల మీదుగా పీఠం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్‌ఓ వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



దంగేరులో యువతకు క్రికెట్ కిట్లను అందిస్తున్న లక్ష్మణ్, రమణ

కె.గంగవరం: యువత క్రీడా స్ఫూర్తితో ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అన్నారు. మండల కేంద్రమైన దంగేరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఆడుదాం ఆంధ్రా కిట్లను వారు యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. దీంతో పాటు క్రీడా సామగ్రిని కూడా ఉచితంగా అందించిందన్నారు. ప్రతిఒక్కరూ ఆటలను స్ఫూర్తిదాయకంగా ఆడి, విజయం సాధించాలని కోరారు. ఇప్పటికే షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతున్నాయని, రేపటి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రాణించి, మండల స్థాయిలో మొదటి స్థానం సాధించాలని వారు ఆకాంక్షించారు. నాయకులు దారా సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

కపిలేశ్వరపురం: పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా మండలంలోని అంగరలో సోమవారం ఫాగింగ్ యంత్రంతో దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావులు పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించారు. పారిశుద్ధ్యంతో పాటు వైద్య, ఆరోగ్య సేవలను సకాలంలో అందించేందుకు ఆయా శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పురపాలక సంఘ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన సోమవారం 21వ రోజుకు చేరింది. వారికి మద్దతుగా రాయవరం మండలం యూటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘం జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నూతన ఉషస్సుకు స్వాగతం

- సందడిగా కొత్త సంవత్సర వేడుకలు
- ఉత్సాహంగా గడిపిన యువత



రాయవరం మండలం సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



క్యాంపు కార్యాలయం వద్ద గోపూజ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాయవరం: ఇంటి గోడకు కాలం కొత్త నేస్తాన్ని బహుమతిగా ఇచ్చింది. కాలచక్రం గిర్రున తిరగడంతో 2023 కాలగర్భంలో కలిసిపోగా, క్యాలెండర్‌లో చివరి పేజీ ఆదివారం తొలగిపోయింది. పన్నెండు మాసాల పాత క్యాలెండర్ గతమై, 365 రోజుల ఆయుష్షుతో కొత్త ఏడాదికి కాలం పురుడు పోసింది. గుండె జ్ఞాపకాల గదిలోకి నిన్నటి రోజులు నిక్షిప్తం కాగా, నిర్మలమైన మనస్సు కొత్త రోజులను ఆహ్వానిస్తోంది. నూతన ఏడాదిని ప్రజలు నిండు మనస్సుతో ఆహ్వానం పలికారు.

సందడి సందడిగా..

మండలంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నిర్వహించిన వేడుకలు ఎక్కడికక్కడ సందడి సందడిగా నిర్వహించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల వరకు టీవీల వద్ద గడిపిన యువత.. అనంతరం రోడ్లపైకి వచ్చి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సోమవారం వేకువజామునే అధిక సంఖ్యాకులు వివిధ దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో మంచి జరగాలని కోరుకున్న ప్రజలు ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు జరిపించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉద్యోగులు తమ పైస్థాయి అధికారులను కలుసుకుని, పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఇళ్లకు వెళ్లి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రాజకీయ పక్షాల నేతలకు, వైద్యులకు పలువురు అభిమానులు శుభాకాంక్షలు చెప్పారు. ఈ నేపథ్యంలో పలువురి ఇళ్ల వద్ద సందడి వాతావరణం చోటుచేసుకుంది. వీధులన్నీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగవల్లులతో నిండిపోయాయి. నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి దుస్సంఘటనలు చోటుచేసుకోకుండా రాయవరం ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



కుందూరులో ఎంపీపీ పంపన నాగమణికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు శశిధర్‌శర్మ

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మండలంలోని పలు చర్చిల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచే చర్చిలకు చేరుకున్న క్రైస్తవ మతారాధకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొని, ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

పరస్పర శుభాకాంక్షలు

కె.గంగవరం: గడచిన సంవత్సరానికి వీడ్కోలు, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ మండలంలో ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి యువకులు బైక్‌లపై హల్‌చల్ చేశారు. మహిళలు ఇంటి వద్ద నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగులతో ముగ్గులు వేశారు. కింది స్థాయి ఉద్యోగులు తమ ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుందూరులో ఎంపీపీ పంపన నాగమణికి మండల పరిషత్ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మండల వీఆర్‌ఓల సంఘం, సచివాలయ సిబ్బంది సమక్షంలో తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకల్లో పాల్గొని, సేవా కార్యక్రమాలు చేపట్టారు.

మంత్రి వేణుకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు

రామచంద్రపురం: నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం కోలాహలంగా సాగాయి. రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తన క్యాంపు కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మంత్రి వేణు అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వేద పండితులతో గోపూజ చేశారు. అనంతరం మంత్రి వేణుకు జిల్లా అధికారులు, నియోజకవర్గానికి చెందిన వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ నేతృత్వంలో సీఐలు, ఎస్సైలు కేక్ కట్ చేసి మంత్రి వేణుకు తినిపించారు. ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్ మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేత సత్తి శంకర్‌రెడ్డి, మండలంలోని డ్వాక్రా యానిమేటర్లు, మహిళా శక్తి సంఘాల సభ్యులు తదితరులు మంత్రి వేణుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వేడుకలు

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులతో తీర్చిదిద్దారు. గొల్లపాలెం ఆలయన్స్ క్లబ్ సభ్యులు వేడుకలు నిర్వహించగా, పలువురు స్థానిక యువకులు కాజులూరు జంక్షన్‌లో భారీఎత్తున బాణసంచా కాల్చారు. వివిధ పార్టీల కార్యకర్తలు మండల స్థాయి నాయకులను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, పలువురు స్థానిక నాయకులు.. అధికారులు, నేతలను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు.

విరబూసిన సంతోషాల హరివిల్లు

- తోట చెంతకు పోటెత్తిన జనం
- సందడిగా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతల నివాసాలు



మండపేటలో చైర్‌పర్సన్ దుర్గారాణికి శుభాకాంక్షలు చెబుతున్న మహిళలు



అర్తమూరులో కర్రి పాపారాయుడుతో పార్టీ శ్రేణులు, అభిమానులు



మండపేటలో ఎమ్మెల్సీ తోట, ఆయన తనయుడు పృథ్వీని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

కపిలేశ్వరపురం (మండపేట): శుభాలకు స్వాగతం పలుకుతూ 2024 నూతన సంవత్సర వేడుకలను మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. మండపేట పట్టణంలోని సూర్య ఫంక్షన్ హాల్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన వేలాది మందితో సందడిగా మారింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖులు, ప్రజలు తరలి వచ్చారు. ప్రభుత్వ అధికారులు శుభాకాంక్షలు తెలపగా, వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. అభిమానులు ఎమ్మెల్సీ తోట, ఆయన తనయుడు పృథ్వీరాజ్‌ను గజమాలతో సత్కరించారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల నుంచి తరలివచ్చిన జనంతో వేదిక సందడిగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన, ఎమ్మెల్సీ తోట చొరవతో ప్రయోజనం పొందిన సామాన్య ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2023 సంక్షేమాభివృద్ధి సంవత్సరంగా పేరొందిందన్నారు. నూతన సంవత్సరం ప్రజలకంతా మంచి జరగాలని ఆకాంక్షించారు.

యువనేత తోట పృథ్వీ సందడి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, యువనేత పృథ్వీరాజ్ సందడి చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన యువజన నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయనకు యువకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడకు శుభాకాంక్షలు

మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తన కార్యాలయంలో సందడిగా గడిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు, 29 వార్డుల వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు దుర్గారాణికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటిలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. అధికారులు, టీడీపీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సందడిగా ప్రముఖుల నివాసాలు

కేశవరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ నివాసానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రంథాలయాధికారులు, గ్రంథాలయ సంస్థకు చెందిన అధికారులు, ఉద్యోగులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు కేక్ కట్ చేశారు. అర్తమూరులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు నివాసం నియోజకవర్గ ప్రముఖులు, కార్యకర్తలతో సందడిగా మారింది. మండపేట పట్టణంలో పార్టీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరికి రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబుకు మున్సిపల్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. మండపేట జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసును మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కపిలేశ్వరపురంలో..

జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బును ఆయన నివాసం నిడసనమెట్టలో కలిసి ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. టేకిలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి నివాసం, వడ్లమూరులో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు నివాసం, సర్పంచ్‌లు, ఎంపీటీసీల నివాసాలు ప్రజలతో సందడిగా మారాయి.

గ్రామాల్లో సంక్రాంతి సందడి ప్రారంభం



గొల్లపాలెంలో పల్లకీలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విష్ణాలయాలు, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఏటా మార్గశిర మాసం ధనుస్సంక్రాంతి మొదలు ధనుర్మాసంలో నెల రోజుల పాటు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వాస్తవానికి ఈ కార్యక్రమాలతోనే గ్రామాల్లో సంక్రాంతి నెల ప్రారంభమైనట్టుగా ప్రజలు భావిస్తుంటారు. దీనినే పలువురు నెల గంటకట్టడం అని కూడా అంటుంటారు. ధనుర్మాసం పురస్కరించుకుని గొల్లపాలెం వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలతో పాటు శీల, కాజులూరు, అయితపూడి, కోలంకల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోను నిత్యం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. రోజుకోరీతిన స్వామివారిని అలంకరించి, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తున్నారు. స్వామివారిని పల్లకీలో ఉంచి, గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఆలయం వద్ద సేవా సంబరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ధనుర్మాస పూజలు, కార్యక్రమాలు భోగిరోజు వరకు కొనసాగుతాయి. గోదాదేవి కల్యాణంతో కార్యక్రమాలు పూర్తవుతాయి. అప్పటివరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి, ప్రసాద వితరణ చేస్తామని గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి కృష్ణమోహనాచార్యులు తెలిపారు.

ఎంపీ బోస్ ఇంట సందడి



హసన్‌బాదలో ఎంపీ బోస్ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంట సోమవారం నూతన సంవత్సర సందడి నెలకొంది. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీ బోస్, ఆయన తనయుడు సూర్యప్రకాశ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్, ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఎంపీ బోస్ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేశారు.

ప్రజాప్రతినిధుల గృహాల వద్ద..

మండలంలోని జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఇళ్ల వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది. ద్రాక్షారామ.. చోడవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వీరేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్

ఐ.పోలవరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సోమవారం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తిలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కలెక్టర్ వెంట సర్పంచ్ కాళే రాజుబాబు తదితరులున్నారు.

దేశానికే ఆదర్శం పింఛన్ల పంపిణీ

కాజులూరు: అవ్వా, తాతలు, వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా, వలంటీర్ల ద్వారా గడప వద్దకే పింఛన్లు అందజేసే కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ మాత భారతి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కాకినాడలో జనవరి మూడో తేదీ బుధవారం జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాజులూరులో ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్లు రూ.మూడు వేలకు పెంపు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ వస్తున్నారన్నారు. పాదయాత్రలో అవ్వ, తాతల కష్టాలు చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే నెలవారీ పింఛను రూ.మూడు వేలకు పెంచుతానని వాగ్దానం చేశారని, ఈ మేరకు పార్టీ అధికారం చేపట్టాక రూ.2250 చేసిన పింఛను ఇప్పుడు రూ.3 వేలకు చేరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, పార్టీ నాయకులు మాత మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో సోమవారం జనసేన నియోజకవర్గ కార్యాలయాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ప్రారంభించారు. మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

పింఛనోత్సాహం

- ఈ నెల 8 వరకూ పింఛను పెంపు ఉత్సవాలు
- రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంపు
- క్లస్టర్ పరిధిలో 64,987 మందికి ప్రయోజనం

మండలం	పింఛన్లు	నగదు
కపిలేశ్వరపురం	10,300	రూ.2,77,77,000
మండపేట	12,097	రూ.3,35,59,250
మండపేట అర్బన్	6,943	రూ.1,92,63,250
రాయవరం	10,146	రూ.2,74,63,250
రామచంద్రపురం	10,753	రూ.2,86,99,750
రామచంద్రపురం అర్బన్	4,563	రూ.1,27,22,000
కె.గంగవరం	10,185	రూ.2,72,47,250

రాయవరం: అవ్వా, తాతలకు.. అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుక అందిస్తున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛనును ఏటేటా పెంచుకుంటూ వెళ్లారు. ఇచ్చిన మాట మేరకు 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే పింఛను రూ.2,250 పెంచి ఇచ్చారు. 2022 జనవరిలో రూ.2,500, గతేడాది జనవరి నుంచి రూ.2,750 చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మరో రూ.250 పెంచి రూ.3 వేలు ఇస్తున్నారు. నూతన సంవత్సర కానుకలో భాగంగా ఈ నెల 3 నుంచి 8 వరకూ ఆరు రోజుల పాటు పింఛను పెంపు ఉత్సవాలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. పెంచిన పింఛన్లతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు లబ్ధి చేకూరింది. దీంతో సామాజిక పింఛనుదారుల మోముల్లో సంతోషం తొణికిసలాడుతోంది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మండపేట నియోజకవర్గంలో 39,486, రామచంద్రపురం నియోజకవర్గంలో 25,501 మందికి పింఛన్ల పంపిణీ జరుగుతుంది. మొత్తం 64,987 మంది లబ్ధిదారులకు రూ.17,67,31,750 పంపిణీ చేయనున్నారు. ఈ నెల 2న కె.గంగవరం, 3న రాయవరం, 4న కపిలేశ్వరపురం, మండపేట, 6న రామచంద్రపురం మండల కేంద్రాల్లో పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల టైమ్ షెడ్యూల్ ఆధారంగా ఆయా మండల కేంద్రాల్లో పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు.



ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీరు (ఫైల్)

చెప్పిన మాట ప్రకారం



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీని చేపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నమాట ప్రకారం పింఛనును రూ.3 వేల వరకు పెంచడం సంతోషంగా ఉంది. మాట తప్పని, మడమ తిప్పని నైజం వైఎస్ కుటుంబానిదని నిరూపించారు.

– కారం పోతురాజు, సామాజిక పింఛనుదారుడు, రాయవరం

మా కష్టాలు తెలుసుకుని..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మా కష్టాలు స్వయంగా తెలుసుకున్నారు. మన సున్న మారాజుగా పేదల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారు. తండ్రికి మించిన తనయుడిగా పేదల కష్టాలను తీరుస్తున్నారు. పింఛనును పెంచడం వల్ల మాలాంటి పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది.

– మెండు సీతారత్నం, పింఛను లబ్ధిదారు, ద్రాక్షారామ

పేదలకు ఎంతో మేలు



కేవలం పింఛనుపైనే ఆధారపడే వారికి పెరిగిన పింఛను ఎంతో మేలు చేకూరుస్తుంది. వృద్ధాప్యంలో, కష్టకాలంలో ఉన్న పేదలు పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మందుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు పింఛనుపైనే ఆధారపడుతున్నాం. పెరిగిన పింఛను మాకు ఎంతో ఉపకరిస్తోంది.

– ఆముదాల లక్ష్మి, పింఛను లబ్ధిదారు, పసలపూడి